క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులతో వాసవి క్లబ్ ప్రతినిధులు, తదితరులు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు సీతమ్మధారకు చెందిన వాసవిక్లబ్ ప్రతినిధులు చెరకు శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా బుధవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. మంచి మార్కులు సాధించిన 10 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంచాలి



సైన్స్ ల్యాబ్ ప్రారంభిస్తున్న గిరిధర్

ఏయూ క్యాంపస్ : పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంచాలని గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ డి.గిరిధర్ అన్నారు. బీచ్‌రోడ్డులోని జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో ఆధునీకరించిన సైన్స్ ల్యాబ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృత్రిమ మేధ, శాస్త్రీయ ఆవిష్కరణలపై చిన్నారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జీవీపీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్ విభాగం డీన్ ఆచార్య దిట్టకవి సరిత మాట్లాడుతూ తొలి దశలో 8, 9 తరగతుల విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కి సంబంధించిన కోర్సులు అందిస్తామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధురవాణి, లాలం రాజేష్, ఉపాధ్యాయులు కిరణ్మయి, మాధురి, అరుణ, ప్రవల్లిక పాల్గొన్నారు.


చిన్నారుల గుండె సమస్యలపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

ఎంవీపీ కాలనీ : చిన్న పిల్లల్లో తలెత్తే గుండె సంబంధిత సమస్యలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కరుణాకర పాడి, డాక్టర్ అశోక్ రాజు సూచించారు. పిల్లల్లో జన్యుపరమైన హృద్రోగ సమస్యలపై ఎంవీపీ కాలనీలోని మెడికవర్ హాస్పిటల్‌లో బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రస్తుతం పుట్టుకతోనే చాలా మందికి గుండె సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, తగిన సమయంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. పిల్లల గుండె శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ అశోక్ రాజు మాట్లాడుతూ గడిచిన 3 నెలల్లో మెడికవర్ హాస్పిటల్‌లో 300 మందికిపైగా పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ బాల్ స్వస్థ్య (ఆర్‌బీఎస్‌కే) పథకంతోపాటు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేసే వెసులుబాటు ఉందన్నారు. సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ సుజిత్‌కుమార్ మహంతి, డాక్టర్ విపుల్, డాక్టర్ నాగసుజిత్, కృష్ణప్రశాంత్ పాల్గొన్నారు.

ఆంధ్రనాట్యంపై 12 నుంచి సెమినార్



డాక్టర్ కళాకృష్ణ

మద్దిలపాలెం : ఆంధ్ర నాట్యంపై మూడు రోజుల సెమినార్ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నటరాజ్ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు బి.ఆర్.విక్రమ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 10 సంవత్సరాల వయసు పైబడిన వారంతా పాల్గొనవచ్చునన్నారు. పాల్గొన్న వారికి డాక్టర్ కళాకృష్ణ సంతకం చేసిన ధ్రువపత్రం అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 8లోగా 9848137445కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

స్థలం చదును చేసేయ్.. బడ్డీలు పెట్టేయ్..

- జీవీఎంసీ పదో వార్డు పరిధిలో టీడీపీ నాయకుల ఇష్టారాజ్యం
- జాతీయ రహదారి పక్కన అనధికారిక బడ్డీల ఏర్పాటు
- ఎమ్మెల్యే పేరు చెప్పి స్థలాలు చదును చేసేసి అమ్మేస్తున్న వైనం
- ఇప్పటికే గెడ్డను పూడ్చేసి ఐదు బడ్డీలు ఏర్పాటు చేయించిన నాయకులు
- పట్టించుకోని జీవీఎంసీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు



జాతీయ రహదారి పక్కన టీడీపీ నాయకుల అండతో గెడ్డను పూడ్చి అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు



చిన్న డబ్బా పెట్టి బడ్డీ ఏర్పాటుకు సిద్ధం చేసిన స్థలం

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి పాత డెయిరీఫారం సమీపంలో జాతీయ రహదారిపై పోటాపోటీగా అనధికారికంగా బడ్డీలు ఏర్పాటు చేసేస్తున్నారు. జీవీఎంసీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు చూసీచూడనట్లు ఉండడంతో టీడీపీ నాయకులు స్థలాలు చదును చేయించేసి... విచ్చలవిడిగా బడ్డీలు ఏర్పాటు చేయించి విక్రయించేస్తున్నారు. రోడ్డు పక్కన గెడ్డను సైతం ఆక్రమించి చదును చేసేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ అక్రమ బడ్డీలను రహదారికి చెందిన గ్రీన్‌బెల్ట్ స్థలంతోపాటు గెడ్డను సైతం ఆక్రమించి ఏర్పాటు చేయడం విశేషం. ఇప్పటికే వెలసిన బడ్డీల్ల కొన్నైతే... ఇంకా కొత్తవి ఏర్పాటు చేసుకోవడానికి మరికొందరు స్థలాలను చదునుచేసి ఇంకెవరూ అక్కడకు రాకుండా వారి స్వాధీనంలో పెట్టుకున్నారు. టీడీపీ నాయకుల్లోని వర్గాలతో ఈ బడ్డీల విషయం ఎమ్మెల్యే వెలగపూడి దృష్టికి బుధవారం వెళ్లింది. ఇక్కడి ఇందిరానగర్ ఆర్చ్ నుంచి విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి వరకు గెడ్డ అంచున జాతీయ రహదారికి సంబంధించిన గ్రీన్ బెల్ట్ కోసం కేటాయించిన స్థలం ఉంది. దీంతోపాటు భవిష్యత్‌లో రోడ్డు విస్తరణ కోసం మార్కు చేసి ఉన్న ఖాళీ స్థలం ఇది. ఇక్కడ స్థానికులకు సౌకర్యం కోసం జీవీఎంసీ గత ఏడాది ఆధునిక బస్ షెల్టర్ నిర్మించింది. ఈ బస్ షెల్టర్‌కు ఇరువైపులా ఉన్న గెడ్డను స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో కొందరు పూడ్చేశారు. ఆ స్థలంలో ఇప్పటికే ఐదు బడ్డీలు ఏర్పాటు చేసేశారు. మరో రెండు స్థలాలను చదునుచేసి బడ్డీలు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఆయా స్థలాల్లో ఒకదానిలో రెండు కర్రలు పాతిపెట్టి వాటికి ఖాళీ కొబ్బరి బొండాలు, ఎర్రటి గుడ్డ కట్టారు. మరో స్థలంలో చిన్న డబ్బా పెట్టి ఆయా స్థలాలను వారు తమ స్వాధీనంలో పెట్టుకొన్నారు. ఇక్కడ బడ్డీలు ఏర్పాటు చేయించిన టీడీపీ నాయకులు వారి పేరు బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. బడ్డీల వద్దకు అధికారులు ఎవ్వరూ రాకుండా... ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పెట్టించారని బయటకు ప్రచారం చేయిస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి బడ్డీల వ్యవహారం

జీవీఎంసీ పదో వార్డు ఇందిరానగర్‌లో బుధవారం జరిగిన రోడ్ల శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్లిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ దృష్టికి ఇక్కడి రహదారి పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు వ్యవహారం వెళ్లింది. జాతీయ రహదారి పక్కన మీ పేరు చెప్పుకుని అక్రమంగా బడ్డీలు ఏర్పాటు చేసుకుని స్థానిక టీడీపీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారని అదే పార్టీలోని మరో వర్గం నాయకులు ఎమ్మెల్యే వెలగపూడికి చెప్పారు. దీంతో ఆయన తెల్లముఖం వేసి నేను ఎవ్వరికీ బడ్డీలు ఏర్పాటు చేసుకోమని చెప్పలేదంటూ స్పష్టం చేశారు. ఆ బడ్డీలను తొలగించేయాలని కార్పొరేటర్‌ను, జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారం ఆయన దృష్టికి వెళ్లడంతో బడ్డీలను అక్రమంగా ఏర్పాటు చేసి సొమ్ము చేసుకున్న కొందరు టీడీపీ నాయకులు తలలు పట్టుకొంటున్నారు. బడ్డీలు తొలగించేస్తే తిరిగి డబ్బులు చెల్లించాల్సి వస్తుందని మల్లగుల్లాలు పడుతున్నారు.

జనసేన ఎమ్మెల్యే పేరు చెప్పి... టీ టైం బడ్డీ



అక్రమంగా ఏర్పాటు చేసిన టీ టైం బడ్డీ... దాని వెనుక గెడ్డను పూడ్చి చదును చేసిన స్థలం

జీవీఎంసీ పదో వార్డు పాత డెయిరీ ఫారం సమీపంలోని బస్ షెల్టర్‌ను ఆనుకుని ఉన్న గెడ్డ స్థలాన్ని టీడీపీ నాయకుల అండతో ఓ వ్యక్తి చదును చేయించేశాడు. అనంతరం జనసేన పార్టీకి చెందిన యలమంచిలి ఎమ్మెల్యే పేరు చెప్పుకుని 'టీ టైం' బడ్డీ పెట్టేశాడు. దాని వెనుక ఉన్న గెడ్డను కూడా చదును చేయించేసి భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేసుకున్నాడు. ఈ టీ టైం బడ్డీకి ఆగమేఘాలపై విద్యుత్ సరఫరా విభాగం అధికారులు మీటరు కూడా ఏర్పాటు చేసేయడం విశేషం.



కర్రలు పాతి వాటికి ఖాళీ కొబ్బరి బొండాలు, గుడ్డ కట్టి బడ్డీ ఏర్పాటుకు సిద్ధం చేసిన స్థలం

'వెలమ సామాజిక వర్గానికి అన్యాయం'

ఏయూ క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 50 లక్షలకుపైగా ఉన్న వెలమ సామాజిక వర్గానికి తీరని అన్యాయం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు ఆరోపించారు. దీనిపై ఉత్తరాంధ్ర మేధావులు గళం వినిపించాలని డిమాండ్ చేశారు. బుధవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో ఆయన మాట్లాడారు. నామినేటెడ్ పదవుల కేటాయింపు నుంచి ఆర్థిక, సామాజిక రంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించడం లేదన్నారు. దశాబ్దాలుగా ఉన్న తమ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని బీసీ – డీ జాబితా నుంచి బీసీ – ఏ జాబితాలోకి మార్చాలని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వెలమ సంక్షేమ భవనాల నిర్మాణానికి భూమి కేటాయించాలని, వెలమ నేస్తం పేరుతో సంక్షేమ పథకాన్ని అందించాలన్నారు. సంస్థ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సత్యం, విశాఖ, అనకాపల్లి జిల్లాల ఇన్‌చార్జులు ఈశ్వరరావు, పైడం నాయుడు, నాయకులు జి.మన్మధరావు, రాజ్ కుమార్, పెదిరెడ్ల శ్రీనివాస్, గొల్లు శ్రీనివాస్, గణేష్‌నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మద్దిలపాలెం : ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. సుమారు 60 జంటలు పాల్గొని కల్యాణం జరుపుకున్నారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు కిషోర్‌శర్మ భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను తోరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

వలంటీర్ల విభాగాన్ని బలోపేతం చేయాలి

- వైఎస్సార్‌సీపీ వలంటీర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న యనమల నాగార్జున యాదవ్

మద్దిలపాలెం : విశాఖ తూర్పు నియోజకవర్గంలో వలంటీర్ల విభాగాన్ని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని, ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ వలంటీర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యనమల నాగార్జున యాదవ్ పిలుపునిచ్చారు. సీతమ్మధారలోని కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న వలంటీర్లు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా చూడాలన్నారు. మన ప్రభుత్వంలో ప్రజలకు వలంటీర్లు చాలా సహాయ సహకారాలు అందించారన్నారు. వారి సేవలను వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఉపయోగించుకోవాలని సూచించారు. వలంటీర్ విభాగాన్ని పటిష్ట పరచాలని కోరారు. సమావేశంలో వలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పీలా ప్రేమ్ కిరణ్, సీనియర్ నాయకుడు సునీల్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుకు చెత్త తరలింపు

సాక్షి ఎఫెక్ట్..



శివాజీనగర్ షాపింగ్ షెడ్ల వద్ద నుంచి చెత్త తరలిస్తున్న లారీ

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి ఆరిలోవ కాలనీ శివాజీనగర్ నుంచి చెత్తను డంపింగ్‌యార్డుకు బుధవారం తరలించారు. ఇక్కడి గెడ్డలో పేరుకుపోయిన చెత్తను శానిటరీ సిబ్బంది వారం రోజుల క్రితం తొలగించారు. ఆ తొలగించిన చెత్తను ఆ పక్కనే వదిలేయడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. దీనిపై 'చెత్త తొలగించారు.. తరలించడం మరిచిపోయారు' శీర్షికతో సాక్షిలో బుధవారం ప్రచురించిన వార్తకు శానిటరీ అధికారులు, వార్డు కార్పొరేటర్ స్పందించారు. జీవీఎంసీ లారీని రప్పించి అక్కడ కుప్పలుగా వేసిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించారు. బుధవారం సాయంత్రానికి మూడు లారీల చెత్త తరలించగా... మిగిలినది గురువారం తరలించనున్నట్లు కార్పొరేటర్ కెల్ల సునీత తెలిపారు.

వినాయక మండపాల వద్ద అన్నసమారాధనలు



అన్నప్రసాదం వడ్డిస్తున్న ముమ్వల సురేష్



22వ వార్డు నేతాజీనగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, పీతల గోవింద్

మద్దిలపాలెం : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 16వ వార్డు పరిధి కేఆర్ఎం కాలనీ, 22వ వార్డులోని బొంతల వీధిలో బుధవారం అన్నసమారాధనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమాల్లో పిలక మధుసూదన రెడ్డి, 23వ వార్డు అధ్యక్షుడు బూస రమణారెడ్డి, కడలి సత్యనారాయణ, నాయుడు కోటి, భాష, రాజు, వేణు, కృష్ణ, సాయిరాం పాల్గొన్నారు.

◆ జీవీఎంసీ 22వ వార్డు నేతాజీనగర్‌లో ఎన్‌వై బాయ్స్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కమిటీ సభ్యులు భాషా, బర్ల రాజు, వేణు పాల్గొన్నారు.

◆ ఆంధ్ర విశ్వవిద్యాలయం సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం వర్సిటీ పరిపాలన భవనం సమీపంలో అన్నదానం చేశారు. ఏయూ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు అన్నప్రసాదం స్వీకరించారు.

బీచ్‌రోడ్డు : వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 20వ వార్డులోని శివాజీపాలెంలో బుధవారం మహా అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్వల సురేష్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద లభించిన బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసును ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. సీఐ హెచ్.మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి దారపాలెంలో ఓ వ్యక్తి వద్ద మద్యం బాటిళ్లు ఉన్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేశారు. ఓ ఇంట్లో అక్రమ మద్యం బాటిళ్లు నిల్వ చేసిన పోలాకి జీవన్‌రావు(55)ను అదుపులోకి తీసుకుని అతని వద్ద లభించిన 20 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. జీవన్‌రావును ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. దీనిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏయూ సమాచారం

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబు, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.హరినాథ్, అసోసియేట్ డీన్ డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో ఎన్‌ఎస్ఎస్ కీలకం

మద్దిలపాలెం : దేశ నిర్మాణంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు కీలక భూమిక పోషించాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీ రిపబ్లిక్ డే ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సహజ నైపుణ్యాలతో రాణించాలన్నారు. సామర్థ్యాలను గుర్తించి, వాటిని మరింత మెరుగుపరచుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఏయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మెగా ఈవెంట్ నిర్వహించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ కేంద్ర యువజన అధికారి సైదా రమావత్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ శిబిరం అత్యుత్తమమైనదన్నారు. పారదర్శకంగా వలంటీర్లను ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథక కార్యక్రమాల్లో ఏయూ అగ్ర భాగాన ఉందని ప్రశంసించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.సింహాచలం, జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూ న్యాయ కళాశాలలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో టీచర్స్ డే వేడుకల్లో భాగంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ఏయూ ఉపకులపతిగా అందించిన సేవలను వివరించారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించారు. రక్తదానం చేస్తే ముగ్గురికి ప్రాణదానం చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో రక్తదాతలుగా నిలవాలని సూచించారు. కళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ రాంబాబుకు సత్కారం

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య కె.రాంబాబును అధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య నగ రాజకుమారి, ఆచార్య ఆర్.పద్మశ్రీ,, కె.వెంకటరావు, ఆచార్య వల్లికుమారి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మద్దిలపాలెం : ఆంధ్ర యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబుకు ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. సమస్యలు త్వరగా పరిష్కరించాలని, విద్యార్థులకు మెరుగైన వసతి, సదుపాయాలు కల్పించాలని కోరారు. పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

ఫ్యాకల్టీ ఎఫైర్స్ డీన్‌గా రాజేంద్రప్రసాద్




నియామకపత్రం అందిస్తున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఎఫైర్స్ డీన్‌గా ఆచార్య కె.రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. సంబంధిత ఉత్తర్వులను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం అందించి అభినందనలు తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన కల్పించాలి

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ (సీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో స్టోరీస్ ఆఫ్ రిసిలియెన్స్ సోషల్ ఇంక్లూజన్ ఆఫ్ ఫిషింగ్ కమ్యూనిటీస్ ఫర్ వికసిత్ భారత్ – 2047 అనే అంశంపై బుధవారం అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివక్షకు గురవుతున్న మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు. క్షేత్ర స్థాయి పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలని, అట్టడుగు వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కెనడాలోని కాంప్సన్ రివర్స్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ సోషల్ వర్క్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలా నిక్కు మాట్లాడుతూ భారతదేశంలోని మత్స్యకారులు ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేకపోతున్నారన్నారు. స్థిరమైన ఆదాయం లేకపోవడంతోపాటు ఏడాదికి రెండు నెలలపాటు చేపల వేటకు విరామం ఇవ్వడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ మత్స్యకారులు ఎదుర్కొంటున్న కష్టాలు వివరించారు. ఐసీఎస్ఎస్ఐఐ డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ చేపల వేట వృత్తి సవాలుతో కూడుకున్నదని, చాలా ప్రమాదకరమైనదన్నారు. మత్స్యకార యువతకు విద్య అవసరమని, ప్రస్తుతం చాలా మంది ఈ వృత్తిని ఎంచుకోవడం లేదన్నారు. పీఏకాన్ ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.దాసు మాట్లాడుతూ తీరం నుంచి సముద్రంలోకి వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు వందలాది మంది మత్స్యకారులు మరణిస్తున్నారన్నారు. డాక్టర్ ఎస్.బాబావలి, డాక్టర్ బి.శివరామకృష్ణ, ఆచార్య ప్రేమానందం పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త



పిఠాపురం కాలనీ రోడ్డు పక్కన చెత్త

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పరిధి పిఠాపురం కాలనీలో రోడ్డుపై చెత్త పేరుకుపోయింది. ఆ చెత్తపై ఆవులు, కుక్కలు చేరి అస్తవ్యస్తం చేస్తున్నాయి. సోమవారం కురిసిన వర్షానికి చెత్త కుప్పల నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటుగా వెళ్లాలంటే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గారావుకు పితృవియోగం



పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కేకే రాజు, మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్ : వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు తండ్రి పల్లా పోతయ్య బుధవారం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, తదితరులు దుర్గారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోతయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు ఇందిరానగర్‌లో రోడ్ల నిర్మాణం కోసం పాతడెయిరీఫారం సమీప ఇందిరానగర్ ఆర్చి వద్ద ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి బుధవారం శంకుస్థాపన చేశారు. పనులు తొందరగా జరిపించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇందిరానగర్‌తోపాటు రాజీవ్‌నగర్, వెటర్నరీ కాలనీలో రూ.74.37 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక గ్రామ కమిటీ పెద్ద విశ్వేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.